ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం


చొప్పదండి పట్టణం మార్కెట్ రోడ్డులో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

చొప్పదండి/గంగాధర: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోంది, ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి పట్టణంలోని మార్కెట్ రోడ్డులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని, అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పెన్షన్‌ల పెంపు, రుణమాఫీ, 108 సేవలు కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం, చేయూత పథకాలు అమలు చేస్తామన్నారు. వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పురం రాజేశం, కొట్టె అశోక్, పెరుమాండ్ల మానస, రంగయ్య, సుధాకర్‌గౌడ్, బుచ్చయ్య, నర్సయ్య, విద్యాసాగర్ రెడ్డి, నర్సింగరావు, యాదగిరి పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

రెండుసార్లు ఓడినా పదేళ్లుగా మీ వెంటే ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశా మూడో సారి పోటీ చేస్తున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని మేడిపల్లి సత్యం ఓటర్లను అభ్యర్థించాడు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. గతంలో గెలిచిన నాయకులు ప్రజా సమస్యలు పట్టించు కోలేదని, తిరిగి వారే మళ్లీ పోటీ చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నారాయణపూర్ రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేస్తా, ఎల్లమ్మ చెరువు మరమ్మతు చేయిస్తానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అర్హులకు అందేలా చూస్తానన్నారు.


మధురానగర్ చౌరస్తాలో సత్యం ప్రచారం

కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

బీఆర్‌ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి


జమ్మికుంటలో రాజేశ్వర్‌రావు ప్రచారం

ఇల్లందకుంట/వీణవంక/కమలాపూర్: 'ఓ వ్యక్తిని నమ్మి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. నియోజకవర్గానికి ఒరగబెట్టిందేంటి.. కేసీఆర్ దయతో మంత్రి పదవి అనుభవించిండు.. కానీ స్వార్థ ప్రయోజనాల కోసమే రాజకీయం చేసిండు. ఒక్క అవకాశం ఇచ్చి అసెంబ్లీకి పంపండి. అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తా' అని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. ఇక్కడి ఎమ్మెల్యేగా రెండుసార్లు మంత్రిగా పని చేసి కూడా సొంత మండలం, నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఉపఎన్నికల్లో గెలిచి ఒక్కసారి మండలానికి రాలేదని, మంత్రిగా ఉండి మహిళా సంఘం భవనం కట్టించలేదని విమర్శించారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు మర్చిపోవద్దన్నారు. 'మీ దయ, దండం పెట్టి, గడప పట్టుకొని, మీ కడుపులో తలపెట్టి మరీ అడుగుతున్న నన్ను గెలిపించండి.. చేసిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తా'నని అన్నారు. వేరేవారు గెలిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుంది, తనను గెలిపిస్తే కమలాపూర్‌ను దత్తత తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మీ ఆడబిడ్డగా కొంగుచాచి భిక్ష అడుగుతున్నా.. నా భర్తను గెలిపించాలని కౌశిక్‌రెడ్డి భార్య షాలిని కోరారు. మా డాడీని భారీ మెజార్టీతో గెలిపించాలని కూతురు శ్రీనిక ఓటర్లను వేడుకున్నారు. అనంతరం కార్యకర్తలు, మహిళలతో కలిసి కౌశిక్‌రెడ్డి డ్యాన్స్ చేశారు. కౌశిక్‌రెడ్డికి మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ రాణిశ్రీకాంత్, జెడ్పీటీసీ కల్యాణిలక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, వైస్ ఎంపీపీ శైలజఅశోక్, సర్పంచ్ విజయతిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, రాధికారమేశ్, నాయకులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

ఇల్లందకుంట మండలంబూజునూర్ గ్రామంలో ఎంపీపీ సరిగొమ్ముల పావనివెంకటేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే పాడి కౌశిక్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి, ఎంపీటీసీ విజయ-కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు విక్రమ్, మాజీ ఎంపీటీసీ రామ్ స్వరణ్‌రెడ్డి, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం

వీణవంక మండలంలోని చల్లూరు, ఇప్పలపల్లి, బేతిగల్, కనపర్తి, ఘన్ముక్కుల గ్రామాలలో పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

గడప గడపకు ప్రచారం

జమ్మికుంట పట్టణంలో పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పట్టణ ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షుడు ఐత మహేశ్ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

అవినీతి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఓటర్లను కోరారు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారం, భారీ ర్యాలీ చేపట్టి ముగించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పదేళ్ల అధికారం ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. అధ్వానంగా మారిన రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ నాయకుల ధర్నా, రాస్తారోకోలు చేపట్టితే రహదారి నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. అభివృద్ధిపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదని, కమీషన్లకు పాల్పడుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అనేక ఇళ్లు నిర్మించామని, కేసీఆర్ పాలనలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా అని ప్రశ్నించారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు ఏమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎంపీపీ ముద్దసాని సులోచన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక చేసే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రెండు లక్షల రుణామాఫీ, రెండు వందల యూనిట్లలోపు విద్యుత్, ఆడపిల్ల పెళ్లికి లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ ఇచ్చే డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కవ్వంపల్లి సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, మాజీ సర్పంచ్ మడుపు శ్యాంసుందర్, అపరాజు శ్రీనివాస్, గోశెట్టి సత్యనారాయణ, గసికంటి సంపత్, కోండ్ర సురేష్, ఇర్ఫాన్, దూలం దేవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్‌కు ఓటేయాలి

కాంగ్రెస్ హుజూరాబాద్ అభ్యర్థి వొడితెల ప్రణవ్


హుజూరాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రణవ్

హుజూరాబాద్/జమ్మికుంట: అన్నివర్గాల సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్‌కు ఓటేయాలని కాంగ్రెస్ హుజూరాబాద్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా పలు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ గెలిస్తే మూడు గంటల కరెంట్ ఇస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, 24 గంటల ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని,బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల అసత్యపు ప్రచారాలు నమ్మొద్దన్నారు. రూ.వెయ్యి కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటున్న బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎవరు ఆపారని, ఏడుసార్లు అవకాశం ఇచ్చినప్పటికీ నియోజకవర్గాన్ని బీజేపీ అభ్యర్థి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, అధ్యక్షుడు కొల్లూరి కిరణ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత, మండల అధ్యక్షురాలు లావణ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

జమ్మికుంట: రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం, ఓడిపోతే చచ్చిపోతానని బ్లాక్‌మెయిల్ చేయడం నాయకుడి లక్షణం కాదని కాంగ్రెస్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి, పొనగంటి మల్లయ్య బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిపై మండిపడ్డారు. కమలాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో గెలిపిస్తే విజయయాత్రకు, లేకుంటే తన కుటుంబ సభ్యుల శవయాత్రకు రావాలని ప్రసంగించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఓడిపోతాననే భయంతో సానుభూతి పొందాలని చూస్తున్నాడని, ప్రజలు అమాయకులు కాదని, ప్రణవ్ గెలుపు ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సలీం, దీక్షిత్, తదితరులున్నారు.

అభివృద్ధి, సంక్షేమం గెలిపిస్తాయి

- యువతీ యువకులకు పోలీస్, ఆర్మీలో శిక్షణ ఇప్పించా
- కాంగ్రెస్‌కు నాయకుడేడీ?.. మాకు కేసీఆరే నాయకుడు
- పొన్నం ప్రభాకర్ మాటలే తప్ప చేతలు శూన్యం
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి

హుస్నాబాద్: 'రెండు సార్లు ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారు. పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మూడో సారి ఆశీర్వదించడం ఖాయం. యువతీ యువకులకు పోలీస్, ఆర్మీలో శిక్షణ ఇప్పించాను. పొన్నం ప్రభాకర్‌వి మాటలే తప్ప చేతలు శూన్యం' అని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తున్నారు..

గ్రామాలకు ఎక్కడికి వెళ్లినా కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తున్నారు. పదేళ్ల కాలంలో దాదాపు రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశాం. ప్రతి గ్రామం, మండలం, జిల్లా కేంద్రానికి రోడ్లు వేశాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశాను. ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట వరకు జాతీయ రహదారి మంజూరు చేయించా. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మిడ్ మానేర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు గోదావరి జలాలు అందించాం. దేవాదుల, కాకతీయ కెనాల్ ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లికి సాగునీటిని అందించాం. రూ.23కోట్లతో శనిగరం ప్రాజెక్టు, రూ.5కోట్లతో సింగరాయ ప్రాజెక్టు పునర్నిర్మాణం చేసి పుష్కలంగా పంటలు పండించుకునే విధంగా నీటిని అందిస్తున్నాం. హుస్నాబాద్‌కు రెండు సార్లు జాతీయ అవార్డులు వచ్చాయి.

సొంత ఖర్చుతో యువతకు శిక్షణ

పదేళ్ల కాలంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా పోలీస్, ఆర్మీలో ఉద్యోగం సాధించేలా సొంత ఖర్చులతో శిక్షణ ఇప్పించాను. దాదాపు 2వేల మందికి శిక్షణ ఇప్పించగా 35 శాతం మంది ఆయా ఉద్యోగాలు పొందారు. ఇప్పటికే యువతకు ఉపాధి కల్పించేందుకు వంగరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో అన్ని మండల కేంద్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తాం.

కరీంనగర్‌లో చెల్లని నోటు ఇక్కడ చెల్లుతుందా..

కరీంనగర్‌లో చెల్లని నోటు హుస్నాబాద్‌లో చెల్లుతుందా, ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు వినేపరిస్థితి లేదు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో మూడు సార్లు ఆదరించలేదు. ఎంపీ ఉన్న సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టుకు తట్టెడు మట్టి పోయలేదు. పొన్నం ప్రభాకర్ మాటల తప్ప చేతల్లో ఏలాంటి పని చేయడు. నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి ఒక్క పైసా తేలేదు. ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌లో ఒక్క మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు మెడికల్ కళాశాలలను మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌దే. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే మెడికల్ కళాశాల ప్రకటన చేశారు. కాంగ్రెస్‌కు నాయకుడెవరో తెలవదు. బీఆర్‌ఎస్‌కు మాత్రం కేసీఆరే మా నాయకుడు. పొన్నం ప్రభాకర్ తన ఐదేళ్లలో అభివృద్ధి చేయని ఆయన ఎందుకు బాండ్ రాసిచ్చాడో తమకు అనుమానం కలుగుతోంది.

పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

ఇటీవల హుస్నాబాద్‌కు వచ్చిన ప్రియాంక గాంధీ మాజీ ప్రధాని పీవీ నర్సింహరావుపై ప్రేమను ఒలకబోసినట్లు మాట్లాడారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలో పీవీ ఫొటో, పేరు ఎందుకు పెట్టలేదో చెప్పాలి. పీవీ చనిపోయినప్పుడు ఢిల్లీలో అంత్యక్రియలు చేయకుండా హైదరాబాద్‌కు తీసుకువచ్చి అవమానపర్చారు. మా కుటుంబ సభ్యులందరం కలిసి పీవీ అంత్యక్రియలు వంగరలో చేస్తామని చెబితే హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు జరిపారు. పీవీ పేరును ఉచ్చరించే అర్హత కాంగ్రెస్‌కు లేదు. పీవీ నర్సింహారావుపై కాంగ్రెస్‌కు ప్రేమ ఉంటే ఏఐసీసీ కార్యాలయంలో పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలని సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు.

జ్యోతిరావుపూలే వర్ధంతి



మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ఆరెపల్లి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి సమర్పించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పూసల శంకర్, బండి కొమురయ్య, గోపు శంకర్‌రెడ్డి, ఎడ్ల దయాకర్‌రెడ్డి, రాములు, సుమన్ పాల్గొన్నారు.

'పోస్టల్ బ్యాలెట్' ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

చొప్పదండి: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంలో గందరగోళం నెలకొనడంతో చొప్పదండి శాసనసభ అసెంబ్లీ రిటర్నింగ్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. తమకు ఓటుహక్కు వినియోగించే అవకాశం ఎన్నికల అధికారులు కల్పించడం లేదని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారి అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసినా స్పందించడం లేదని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు దాటవేత సమాధానాలు ఇస్తున్నారని ఆరోపించారు. బ్యాలెట్ ఉపయోగించుకొనే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రం నుంచి పలువురి పేర్లతో మరో లిస్టు రావడంతో వారు ఉపయోగించుకున్నారు. మరికొందరు ఉద్యోగుల పేర్లు వారికి డ్యూటీ కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఓటు వేసుకోవాలని సూచించడంతో వెళ్లిపోయారు. మరికొందరి పేర్లు రాకపోవడంతో ఓటుహక్కు వినియోగించుకోకుండానే వెనక్కివెళ్లారు.

'గండిపల్లి'ని పూర్తి చేస్తాం


అభివాదం చేస్తున్న పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ హుస్నాబాద్ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో కొట్లాడతానని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండలం రామవరంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు, మారుమూల పల్లెల అభివృద్ధి బాధ్యత తనదని చెప్పారు. ప్రతి గ్రామాల్లోని లింక్ రోడ్లన్నీ తారురోడ్లుగా నిర్మిస్తామన్నారు. తండాలకు బీటీ రోడ్లు వేయిస్తామని భరోసానిచ్చారు. గౌరవెల్లి భూ నిర్వాసితులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. మూడు నెలల వ్యవధిలో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ఈ పాంత్ర చిరకాల కోరికైన గండిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, ఉప సర్పంచ్ శేరి కనకయ్య ఉన్నారు.

ఓటు దుర్వినియోగం చేయొద్దు

హుజూరాబాద్: ఓటును డబ్బు తో దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఓటుహక్కు విలువకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో పలుచోట్ల పోస్టర్లు గోడలకు అంటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

బైండోవర్ ఉల్లంఘన

తిమ్మాపూర్: మండలంలోని చేపలకాలనీ అలుగునూర్‌కు చెందిన వంగల చరణ్‌కు బైండోవర్ ఉల్లంఘించినందుకు తహసీల్దార్ కనుకయ్య రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎల్‌ఎండీ ఎస్‌ఐ శీలం ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యంతో పోలీసులు అక్టోబర్ 17న తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఆరునెలలలోపు నేరం చేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని, ఆరునెలల జైలుశిక్ష పడుతుందని ఉత్తర్వులు జారీ చేశారు. చరణ్ ఈ నెల 17న బైండోవర్ ఉల్లంఘించాడు.ఎల్‌ఎండీ పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి చరణ్‌ను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఆరునెలల జైలుశిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించాలని తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. చరణ్ జరిమానా చెల్లించాడు. ఆరునెలలు అతడిపై నిఘా కొనసాగుతుందని ఎస్సై, తహసీల్దార్ తెలిపారు.

- సైన్స్ ఎగ్జిబిషన్


ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ పంకజ్‌కుమార్

తిమ్మాపూర్: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకే నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి, పని తీరు తెలుసుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు 92 మంది విద్యార్థులు 36 ప్రాజెక్టులను ప్రదర్శించారు. మోడల్స్, డెమాన్‌స్ట్రేషన్ ఫ్లాష్ కార్డు, రియల్ ప్రాజెక్టు ఐడియాస్‌తోపాటు వివిధ రకాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర గుప్త, బాల వైజ్ఞానిక కమిటీ సభ్యులు దివ్య భారతి, సరిత, మమత, శ్రావణ్‌కుమార్, అనురాగ్ పాల్గొన్నారు.

- బీఆర్‌ఎస్‌తో ముస్లింలకు అన్యాయం

మానకొండూర్: బీఆర్‌ఎస్ మోసపూరిత వాగ్దానాలతో ముస్లింలు అన్యాయానికి గురయ్యారని తెలంగాణ రాష్ట్ర ముస్లిం జేఏసీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ మహ్మద్ మోహినొద్దీన్ రహీం ఆరోపించారు. మానకొండూర్‌లో మంగళవారం ముస్లింలతో కలిసి మాట్లాడారు. 9 ఏళ్లుగా ముస్లిం ఏలాంటి లబ్ధి పొందలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనని, ముస్లిం డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో నియోజవర్గ ఇన్‌చార్జి ముస్తాఫా, నాయకులు మహ్మద్ షాదిక్, సయ్యద్ సిరాజోద్దీన్, శంకరపట్నం ఆరీఫ్, ఆసీఫ్‌పాషా పాల్గొన్నారు.

- హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి జి.రాజ్‌కుమార్ అండర్ -19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మంగళవారం రాజ్‌కుమార్‌ను అభినందించారు. డిసెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

- తనిఖీ, నగదు, మద్యం పట్టివేత

శంకరపట్నం: కేశవపట్నంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

హుజూరాబాద్: పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద నగదు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామని ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ.1,64,500 స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ స్టేజి వద్ద మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఇన్‌చార్జి ఎం.కార్తీక్ వాహనాలు తనిఖీ చేయగా హరీశ్, శ్రీనివాస్ పట్టుబడ్డారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎల్‌ఎండీ ఎస్‌ఐ శీలం ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

జమ్మికుంట: అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తి రూ.17, 280 మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.